

నేడు పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి-కాకినాడ

నవంబర్ 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సామాజిక భద్రత కింద జిల్లాలో ఎన్టీఆర్ భరోసా నవంబర్ నెలలో పింఛనుదారులకు నవంబర్ 1న సొమ్ము ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నవంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 2,71,628 మందికి రూ.118.01 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచే సచివాలయం సిబ్బంది పింఛన్‌దారులకు వారి ఇంటి వద్దనే సొమ్ము అందజేస్తారని కలెక్టర్ తెలిపారు.

ఏలేరు ముంపుతో ముప్పు

- నీటిని వదులుతున్న అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు
- గతేడాది గండ్లను నేటికీ పూడ్చని వైనం
- తాజా తుపానుతో మరిన్ని గండ్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వల్ల ఏలేరుకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అధికారులు మిగులు జలాలను నాలుగు ఐదు రోజుల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముంపు ముప్పు పొంచి రైతాంగం తీవ్ర స్థాయిలో కలత చెందుతోంది. ఏలేరు ప్రాజెక్టు పై 67, 614 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఐయిదు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. పిఠాపురంలో 7,960 ఎకరాలు, గొల్లప్రోలు 4,300, కొత్తపల్లి 4,483, కాకినాడ రూరల్ 1,780, సామర్లకోట 7,361, పెద్దాపురం 4,150, తాళ్లరేవు 3,529, కాజులూరు 7,570 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఏలేరు ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీరు శివారు ఆయకట్టు పిఠాపురం నియోజకవర్గానికి అధికంగా వస్తోంది.

దిగువకు 8,500 క్యూసెక్కులు

24.11 టిఎంసిల సామర్థ్యం గల ఏలేరులో పైనుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రస్తుతం 22.20 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయి. 23,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అవుట్‌ఫ్లో 8,500 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలోని లోతట్టు ప్రాంతాలు పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడుతున్నామని కూటమి నాయకులు, అధికారులు చెబుతున్నప్పటికీ పలుచోట్ల ఏలేరు అదనపు జలాలు పంటలను ముంచెత్తి నష్టాలకు గురి చేస్తోంది. వరదల సమయంలో ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతం అవుతోంది. పాలకులు హామీలు ఇస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కార మార్గాల వైపు కనీసం ఆలోచనలు చేయడం లేదు. అధికారుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించి చేతులు దులుపుకుంటున్నారు తప్ప సీరియస్‌గా సమస్యను నివారించేందుకు సరైన మార్గాలను అన్వేషించడం లేదనేది రైతుల ప్రధాన ఆరోపణ.

ఆందోళనలో అన్నదాతలు

ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న వరద నీటితో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గట్లు వరకూ నీరు చేరింది. బలహీనంగా వున్న గట్ల వద్ద ఇసుక బస్తాలు వేసినా పరిస్థితి అదుపులో లేదు. దీంతో నాలుగు రోజులుగా కిర్లంపూడి మండలం నుంచి పిఠాపురం వరకు 20 చోట్ల గండ్లు పడినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లులో 7 చోట్ల, రాజుపాలెంలో రెండు, సోమవరాయునిపేటలో 2 గండ్లు పడ్డాయి. ఇవి 50 నుంచి 120 మీటర్ల మేర పడడంతో పూడ్చడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తొండంగి మండలం వజ్రకూటం వద్ద రెండు, తొండంగి సమీపంలో ఒక చోట గండ్లు పడ్డాయి. గొల్లప్రోలులో 3 పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో ఒక్కో చోట గండ్లు పడ్డాయి. శివారు ఆయకట్టు కావడంతో పిఠాపురం గొర్రికండి వద్ద నీరు నిండుగా ప్రవహిస్తోంది. గొల్లప్రోలు, సుద్దగడ్డ, కాలువల్లో నీరు ఎక్కువగా చేరింది. పంటకాలువలు గట్లు దాటి ప్రవహిస్తున్నాయి. తాజాగా శుక్రవారం కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద ఏలేరు కాలువకు మరో పెద్ద గండి పడింది. దీంతో పంట పొలాలు నిండా మునుగుతున్నాయి. ఇదే క్రమంలో పెద్దాపురం మండలం వడ్లమూరు వద్ద, పిఠాపురం పట్టణ శివారు గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద ఉన్న గొర్రెఖండి కాలువకు గండి పడింది.


కిర్లంపూడి మండలం ముక్కోల్లు వద్ద కాలువకు పడిన గండి

కాలువల నిర్వహణలో లోపాలు

కాలువల్లో ఏళ్లుగా మట్టి, ఇసుక, వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల ముంపు సమస్య ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు, కాలువలు ఆ నీటిని పూర్తిగా తీసుకోలేక, అవి పొంగి పొర్లి సమీపంలోని పొలాలను ముంచెత్తుతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి తలెత్తుతోంది. మరోవైపు కాలువల గట్లు బలహీనంగా ఉండటం, తూములు సరిగా పనిచేయకపోవడం, ఆక్రమణలకు గురికావడం తదితర కారణాల వల్ల ముంపు సమస్య రైతులను తీవ్రంగా నష్టాలకు గురి చేస్తోంది. వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి, నీటిని మళ్లించడానికి, నిల్వ చేయడానికి ముందుగానే సమర్థవంతమైన ప్రణాళికలు లేకపోవడం సమస్యగా మారింది. వరద నీరు పొలాల్లోకి వచ్చిన తర్వాత, తిరిగి బయటికి పోవడానికి మార్గం లేక ఎక్కువ కాలం నిలిచిపోయి పంటలు కుళ్లిపోతున్నాయి. మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం కూడా నష్టాలకు కారణంగా ఉంది. కాలువల పూడికతీత, మరమ్మతుల పనులకు నిధులు కేటాయించినా, ఆ పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో పడిన గండ్లు పూడ్చని వైనం

గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదల కారణంగా ఏలేరుకు 280 చోట్ల గండ్లు పడ్డాయి. తాత్కాలిక పనుల పేరుతో అప్పట్లో 67 గండ్లను మాత్రమే పూడ్చి కూటమి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మొత్తం గండ్ల పనుల నిర్వహణకు రూ.28.38 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రతిపాదనలు చేయగా అప్పట్లో కేవలం రూ.5.51 కోట్లు మాత్రమే నిధులు విడుదల చేసి మమ అనిపించారు. మిగిలిన పనులకు ఇంకా రూ.10 కోట్లు పైనే ఖర్చవుతుంది. కానీ నాడు వరదల సమయంలో పర్యటించిన చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నేటికీ నిధులు విడుదల చేయలేదు. గండ్లు పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో రైతులకు భారీ నష్టం తప్పడం లేదు.

వరదలతో ఏటా నష్టాలే



వరదల వల్ల ఏటా నష్టాలను భరిస్తున్నాం. ఎకరాకు రూ.30 వేల వరకూ నష్టం వస్తుంది. గండ్లు పడుతున్నాయని అధికారులకు అనేకసార్లు విన్నవిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం హామీలు ఇస్తున్నా అమలు చేయడం లేదు. ప్రభుత్వం తక్షణ స్పందించి ఏలేరు ఆధునీకరణ పనులను చేపట్టాలి.

- మొరుకుర్తి సూరిబాబు, రైతు, రాపర్తి, పిఠాపురం

ఏలేరు కాలువకు గండి

ప్రజాశక్తి -కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం

కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద ఏలేరు కాలువకు గండి పడింది. ఏలేరు రిజర్వాయర్‌లోకి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో కిందికి శుక్రవారం 8,675 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత వచ్చే నీరు తగ్గడంతో ఔట్ ఫ్లోను 6 వేల క్యూసెక్కుల తగ్గించారు. ఏలేరు కాలువ ఉదతంగా ప్రవహించి రాజుపాలెం వద్ద బలహీనంగా ఉన్న చోట నుండి నీరు పొంగి గండి పడింది. గండి పడిన ప్రాంతానికి అధికారులు చేరుకుని ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. ఐతే కాలువ పక్కన ఉన్న పండిన పంటలు నీటిలో మునిగి ఉన్నాయి. ఏలేరు పరీవాహక గ్రామాలను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆర్‌డిఒ శ్రీరమణి, అధికారులతో కలిసి పరిశీలించారు.

గొల్లప్రోలు పట్టణ పరిధిలోని టోల్గేట్ సమీపంలో ఉన్న ఏలేరు కాలువ గట్టుకు గండి పడింది. దీంతో ఫీడింగ్ దొడ్డు హైవేను ఆనుకుని ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. ఏలేరు ప్రవాహం ఇంకా పెరిగితే జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ నివారణ చర్యలు చేపడతామన్నారు.


పిఠాపురంలో పిడిందొడ్డి కాలువకు పడిన గండి

పిఠాపురం ఏలేరు జలాశయానికి భారీగా వరద నీరు చేరుకుంది. దఈంతో నీటిని విడుదల చేయడం వల్ల దిగువ ప్రాంతంలోని కాలువలు వరద నీరుతో పొంగి ప్రవహించడంతో గట్లు కుంగి రైతులకు గండ్ల రూపంలో కష్టాలు తీసుకుని వచ్చాయి. గొర్రెఖండి కాలువ పరిధిలో ఏడు చోట్ల గండ్లు పడినట్లు సమాచారం. దీంతో క్రమేపీ వరద నీరు పొలాల్లోకి చేరుతోంది. తమ పొలాలను ముంపు నుంచి కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గండ్లు పడిన ప్రాంతాలను ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఇ కె.గోపీనాథ్, ఈస్ట్రన్ గోదావరి డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్, ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఊటా నానిబాబు పరిశీలించారు.

డాక్టర్ గేయానంద్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

జెవివి పూర్వ అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ రాసిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు అనే పుస్తకాన్ని యుటిఎఫ్ హోమ్‌లో నాయకులు జి.ప్రభాకర వర్మ, ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సత్తిరాజు శుక్రవారం ఆవిష్కరించారు. జెవివి జిల్లా అధ్యక్షుడు కెఎంఆర్.ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రజలకు ఆరోగ్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు బలంగా ఉంటేనే, ప్రైవేట్ వైద్యరంగం కూడా నియంత్రణలో ఉంటుందని, కనుక ఈ పిపిపి విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌హెచ్‌పి.వర్మ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సూరిబాబు, ఎన్‌వి.పద్మావతి, యుఎస్ఎన్.రెడ్డి, బివివి. సత్యనారాయణ, కె.ఈశ్వరరావు, సిహెచ్.సతీష్, సునీత పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్, జెవివి నాయకులు

4న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయం ఈ నెల 4న లెక్కిస్తామని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు దేవాదాయ శాఖ నిర్మించిన అధికారుల పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు.

ఏలేరు దబ్బ కాలువ పరిశీలన

ప్రజాశక్తి-పెద్దాపురం

కాండ్రకోటలోని ఏలేరు దబ్బ కాలువ వద్ద ఏలేరు ఉధృతిని శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల తుపాను నేపథ్యంలో గ్రామ పరిధిలో ఏలేరు పరీవాహక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దబ్బ కాలువ వద్ద ఉధృతికి రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. ఎలిశెట్టి నాని, తిరుపతి సర్పంచ్ ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

వ్యాధుల నివారణకు గ్రామాల్లో ఆరోగ్య పర్యవేక్షకులు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని తాటిపర్తి, చినజగ్గంపేట, వన్నెపూడి, కొడవలిలో శుభ్రతపై డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడడం డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, జ్వరం లక్షణాలు ఉంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

కౌలు రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

ఇటీవల తుపాను వల్ల పంటలు నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని, పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాధికారులు పంటల నష్టాన్ని కేవలం రెండు రోజుల్లో హడావిడిగా సేకరించి నిర్ధారణ చేయడవెనుక కారణం ఏమిటో తెలియజేయాలని తడిసిన ధాన్యం కొద్ది రోజులకు అది ఎందుకు పనిచేయదని చెప్పారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడారు. గతంలో వారం రోజుల వరకూ పంటల నష్టాన్ని అంచనా వేసే వారని, కానీ అధికారులు రెండు రోజుల్లో ఈ హడావుడిగా పూర్తిచేశారని చెప్పారు. ఇప్పుడు తడిసిన ధాన్యం పని చేయదని అందువల్ల అందరికీ పూర్తి పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ పథకంలో ఇవ్వాల్సిన నగదును వెంటనే కౌలు రైతులకు అందించాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల మాదిరిగా క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో సంబంధం లేకుండా ఆ భూమిలోని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాజశేఖర్, రాజబాబు, హరిబాబులు కోరారు. అనంతరం కుళ్ళిన వరి పంట దుబ్బులను తీసుకువెళ్లి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి చూపించి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సిహెచ్.సతీష్, యడ్ల కృష్ణ, వాసంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మత్స్యకారులు సంఘాల్లో నమోదు కావాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రతి మత్స్యకారుడూ సహకార సంఘంలో నమోదు చేసుకోవాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పరుపుల సత్యప్రభ సూచించారు. శుక్రవారం వేటకు దూరమైన 406 మత్స్యకార కుటుంబాలకు 50 కిలోలు బియ్యం, మంచి నూనె, కందిపప్పు, పంచదార, నిత్యవసరాలు కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన మత్స్యకారులకు ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. ఇటీవల వేట కెళ్ళి మృతి చెందిన మత్స్యకార కుటుంబాలకు చెక్కులను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, రాయుడు చిన్న, టిడిపి మండల అధ్యక్షుడు జ్యోతులు పెదబాబు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, మత్స్య శాఖ అధికారి రాజేంద్ర కుమార్ ఉన్నారు.


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

పునరావాస కేంద్రాల్లో వసతుల కల్పన

ప్రజాశక్తి-కాకినాడ

తుపాను నేపథ్యంలో జిల్లాలోని తీర, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులూ కల్పించామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అమరావతి నుంచి తుపాను అనంతరం చేపట్టిన సహాయ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సహాయం పునరావాస కార్యక్రమాలు చేపట్టడంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన సూచించారు. తుపాను ప్రభావం ఉన్న కుటుంబాలకూ, బాధితులకు నిత్యావసర వస్తువులు, నగదు పంపిణీపై జిల్లా అధికారులకు ఉప ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ షాన్ మోహన్ సగిలి జిల్లాలో తుపాను సమయంలో చేపట్టిన కార్యక్రమాలు, తుపాను అనంతరం చేపట్టిన సహాయక కార్యక్రమాల గురించి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావానికి జిల్లాలో 21 మండలాల్లోని 68 గ్రామాలు, 7 పట్టణ ఆవాసాల్లో మొత్తం 434 పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేసి 97 కేంద్రాలను తెరిచామని, 48,025 మంది ప్రజలు ప్రభావితం అయ్యారని తెలిపారు. తుపాను తాకిడికి గురి కాగల ప్రాంతాలు, పూరి గుడిసెలు, బలహీన గృహాలలో నివశిస్తున్న ప్రజలను సురక్షిత ప్రదేశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు, ఇతర కనీస వసతులు కల్పించామని తెలిపారు. తుపాను వల్ల 61 ఇళ్లు పాడయ్యాయని, వ్యవసాయ శాఖలో 33,596 మంది రైతులకు సంబంధించి 21 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, హార్టికల్చర్‌కు సంబంధించి 1,201 మంది రైతులకు సంబంధించి 668 హెక్టార్లు పంటకు నష్టం వాటిల్లిందని ఆయన వివరించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'విజిలెన్స్ మనందరి సంయుక్త భాద్యత' అనే అంశంపై రామచంద్రాపురం ప్రేమానందం బుర్రకథ బృందగానం శుక్రవారం ఆసక్తికరంగా సాగింది. నిజాయితీ, సమగ్రత, నైతికత మొదలగునవి ఎంత ముఖ్యమో ప్రేమానందం బృందం వర్ణించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ అధికారులు కోటేశ్వర్రావు, శ్రీనివాస్, హెడ్ మాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

2న జిల్లా స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

కబడ్డీ అసోషియన్ ఆధ్వర్యంలో 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నవంబర్ 2న సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఎంపిక పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులకు బరువు పరిమితి బాలురు 60 కిలోల కంటే తక్కువ, బాలికలు 55 కిలోలు కంటే తక్కువ ఉండాలన్నారు. వయస్సు 16 సంవత్సరాలు, అంత కంటే తక్కువ ఉండాలన్నారు. 2009 డిసెంబర్ 1 లేదా ఆ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - సామర్లకోట

కోరం సరిపోని కారణంగా సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం వాయిదా పడింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. అరగంట గడిచినప్పటికీ ఇద్దరు టిడిపి సభ్యులు, వైసిపి నుంచి టిడిపిలోకి వెళ్లిన మరో సభ్యురాలు మొత్తం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీంతో చైర్‌పర్సన్ అరుణ కోరం సరిపోని కారణంగా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణకు, వైసిపి కౌన్సిలర్లకు మధ్య ఏర్పడిన వివాదం అనేక మలుపులు తిరిగి కోర్టుకి చేరుకోవడంతో, వైసిపి కౌన్సిలర్లు ముకుమ్మడిగా కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానం విషయంలో హైకోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, తనపై కక్షతోనే వైసిపి కౌన్సిలర్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరయ్యారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ వ్యాఖ్యానించారు. రూ.కోటీ 45 లక్షల వ్యయంతో పట్టణ అభివృద్ధికి అజెండాను రూపొందిస్తే, తనపై కక్ష కట్టి కౌన్సిలర్ సమావేశానికి హాజరు కాలేదని చెప్పారు.


సమావేశానికి హాజరైన ముగ్గురు సభ్యులు


ఎంఎల్ఎ చినరాజప్పకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిలో విషపూరిత జలాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

గోదావరి కాలువలో పలు పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా వస్తున్న పరిశ్రమల వ్యర్థ జలాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. విషపూరిత వ్యర్థ జలాలు కలవడం వల్ల పశుపక్షాదులు చనిపోవడంతో పాటు పంటలు పలు రకాల వ్యాధులకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో రైతు సంఘం నాయకుడు కంటే జగదీశ్ మోహన్ ఆధ్వర్యంలో పలువురు రైతులు పాల్గొని ఎంఎల్ఎకు సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీశ్ మోహన్ మాట్లాడుతూ వేట్లపాలెంఎగువ ప్రాంతాల్లోని పలు పరిశ్రమల నుంచి విషపూరిత వ్యర్థ జలాలు గోదావరి కాలువలో కొద్ది నెలలుగా కలుస్తున్నాయని, దీంతో కాలువ నీరు విపరీతమైన దుర్గంధం వస్తోందని తెలిపారు. ఈ నీటిని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలకు చెందిన లక్షలాదిమంది ప్రజలు తాగునీటిగా వినియోగిస్తున్నారని, పశుపక్షాదులు కూడా ఇదే నీటిపై ఆధారపడి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ బాపినీడు, పైన్ని శ్రీనివాసరావు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, పైన్ని సత్యసాయి రామకృష్ణ, గుమ్మడి రామకృష్ణ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభానికి ఒప్పందం

ప్రజాశక్తి-కాకినాడ

అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కాకినాడ జెకెసి (జవహర్ నాలెడ్జ్ సెంటర్) సంయుక్తంగా బి.కామ్ విద్యార్థినుల కోసం రిటైల్, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర వి.అనంతలక్ష్మి తెలిపారు. విద్యార్థులకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేసినట్టు తెలిపారు. మొత్తం 28 మంది విద్యార్థినులు ఈ శిక్షణ కార్యక్రమానికి నమోదు చేసుకున్నారన్నారు. ఈ నూతన శిక్షణా అనంతరం విద్యార్థినులకు రిటైల్ రంగంలో ఉద్యోగావకాశాలు పెంచడానికి అవసరమైన నైపుణ్యాలు, కమ్యూనికేషన్, మృదు నైపుణ్యాలు అలవరచే అవకాశం కల్పిస్తామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సువర్చల, ఎం.వసంత లక్ష్మి, డాక్టర్ సంజోత, శిరీష, డాక్టర్ పి.ప్రమీలారాణి, జెకెసి మెంటార్ వి.వెంకటరమణ, రమ్య సుధ పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమానికి పేరు నమోదు చేసుకున్న విద్యార్థినిలు

విడిఎ పాయింట్స్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అక్టోబర్ నెల పూర్తయినా నేటికీ కార్మికశాఖ విడిఎ పాయింట్స్ గెజిట్ విడుదల చేయకపోవడం కార్మికులకు నష్టదాయకమైన చర్య అని సిఐటియు రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా విమర్శించారు. తక్షణమే కార్మికశాఖ విడిఎ పాయింట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నేపథ్యంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడిఎ పాయింట్స్ పెరగాల్సి ఉంది. సంవత్సరానికి రెండు పర్యాయాలు విడిఎ పాయింట్స్ విడుదల చేయవలసి ఉందన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

రెండు ఇసుక లారీల స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

సరైన పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి డి.ఫణిభూషణరెడ్డి, ఇసుక టాస్క్ ఫోర్స్ అధికారి ఆంజనేయులు కొవ్వూరు, వాడపల్లి గ్రామాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ లారీలను గుర్తించి పట్టణ పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు. ఇవే వాహనాలు ఈనెల 8న పట్టుబడినట్లు ఖమ్మం జిల్లా కల్లూరు సబ్ కలెక్టర్ లేక ద్వారా తెలిపారన్నారు. ఈ రెండు వాహనాలు గతంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి గుండా అక్రమ ఇసుక రవాణా చేసిన కేసుల్లో పట్టు బడినట్లు తెలిపారు. ఈ రెండు వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు.

తప్పిపోయిన మహిళల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

తప్పిపోయిన ఇద్దరు మహిళల ఆచూనీకి పోలీసులు గుర్తించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి గత 28వ తేదీ నుండి కనిపించటం లేదని ఆమె తల్లి తండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. వీరవరం గ్రామానికి చెందిన వివాహిత 4 ఏళ్ల బాబుతో గత 17వ తేదీ నుండి కనిపించడంలేదని ఆమె బంధువులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఆ రెండు పిర్యాదుల మేరకు వారి వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ బాబు, ట్రైనీ ఎస్ఐ రాజా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. వారు హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించామని, వారిని తీసుకుని వచ్చి బంధువులకు అప్పగిస్తామని తెలిపారు.

సారా తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం శివారు మండపం వద్ద ఆటోలో సారా తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ హరిబాబు తమ సిబ్బందితో గురువారం రాత్రి మండపం సెంటర్ హైవే దగ్గరలో దాడులు నిర్వహించగా ఆటోలో తరలిస్తున్న 72 లీటర్ల సారా తోపాటు నాలుగు బెల్లం బస్తాలను పట్టుకున్నారు. పెదమల్లాపురం వద్ద సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడి చేసి సుమారు 1500 లీటర్ల బెల్లం ఊటతో పాటు సారా తయారీకి ఉపయోగించే వంట సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

తుపాను సాయం అందరికీ ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తుపాను బాధితులందరికీ సాయం అందజేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. పార్టీ కార్యాలయంలో సంతోష్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో తీరం ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడిందన్నారు. వారం రోజుల పాటు ఎటువంటి పనులకూ వెళ్లలేదనానరు. కొంత మందికి సాయం అందించి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తోందన్నారు.

టీచర్ వద్దని గ్రామస్తుల అభ్యంతరం

ప్రజాశక్తి- తాళ్లరేవు

పాఠశాలకు బదిలీపై వస్తున్న ఉపాధ్యాయిని తమకు వద్దని విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంజరం జెడ్‌పి హైస్కూల్‌కు కొత్తగా నియమితులైన ఒకఉపాధ్యాయిని తమకు వద్దని డివైఇఒ కెవివి సత్యనారాయణను గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి అభ్యంతరం తెలిపారు. ఆమె గతంలో పని చేసిన పాఠశాలల్లో వివాదాలకు కారణమయ్యారని, దీనిపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశ్శామని తెలిపారు. దీనిపై డివైఇఒ సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

పరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-కాకినాడ

దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరామ్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి ఫిషర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రెసింగి ఆదినారాయణ శుక్రవారం వినతిపత్రం అందించారు. సాయిరామ్‌కు ఏడాది క్రితమే వివాహం అయ్యిందని, 11 నెలల కుమారుడు, తల్లిదండ్రులతో పాటు ముగ్గురు చెల్లెళ్ల మొత్తం కుటుంబ బాధ్యత సాయిరామ్‌పై ఆధారపడి ఉందని చెప్పారు. తగిన పరిహారం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ఎఒలకు ఎంపిడిఒలుగా ప్రమోషన్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాల అధికారులుగా పని చేస్తున్న ఇద్దరికి ఎంపిడిఒలుగా ప్రమోషన్ కల్పిస్తూ శుక్రవారం జెడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. జెఎల్ఎన్.దీక్షితులు ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో, జె.శ్రీనివాస్ కరప మండల పరిషత్ కార్యాలయంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్‌పి సిఇఒ జివిఎస్.రామ్ గోపాల్ పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసు అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎపిఎస్‌పిలో కమాండెంట్ ఎం.నాగేంద్రరావు ఆధ్వర్యాన శుక్రవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. డి.మురళీ కుమార్, ఎస్.మన్మధ రావు, అధికారులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అమరవీరులకు స్థూపం వద్ద నుంచి మెయిన్ రోడ్ మీదగా ర్యాలీ నిర్వహించారు.

యానాం వార్తలు



నివాళర్పిస్తున్న ఆర్ఎఒ అంకిత్ కుమార్, ఎస్‌పి వరదరాజన్

ఇందిరా గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్థంతిని సమాచారశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కార్యలయాల సమీపంలో యుకెవి నగర్ ఏటుగట్టు రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహాలకు పరిపాలనాధికారి అంకిత్ కుమార్, ఎస్‌పి వరదరాజన్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, చెక్కల అరుణ్ కుమార్, పైడికొండల రాజబాబు, చింతకాయల జ్ఞానేశ్వర్ తదితరులు నివాళర్పించాలి.

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి రాజ్ నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాశనాథన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించినట్లు మల్లాడి తెలిపారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చంద్ర చౌహాన్, కలెక్టర్ కులోత్తుంగన్ తదితరులను కలిసినట్టు తెలిపారు.

నేడు పుదుచ్చేరి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

శనివారం పుదుచ్చేరి విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆర్ఎఒ అంకిత్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరిస్తారని, అనంతరం విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయని సమాచారశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ, గాడ్ ఆఫ్ హానర్, శాంతి కపోతాలు ఎగుర వేయడం, ఆర్ఎఒ ప్రసంగం, మార్చ్ ఫాస్ట్, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న గరికపాటి

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామిని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహమూర్తి శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన గరికిపాటికి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆలయ లాంఛనాలతో స్వాగతించారు. అనంతరం గరికపాటి దంపతులు స్వామివారి వ్రతాన్ని ఆచరించి దర్శించుకున్నారు.

ఎంఎస్ఎన్ ధర్మకర్తల మండలి ప్రమాణం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్‌కు సంబంధించి రెండేళ్ల కాలానికి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయక్ చైర్మన్‌గా వ్యవహరించారు. ధర్మకర్తలుగా నులుకుర్తి సత్య సాయి, ముగు చిన్ని, దుర్గాప్రసాద్ పిల్లారి శెట్టి, రాళ్లపూడి ప్రకాష్, పిర్ల లక్ష్మీప్రసన్న, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, మందపాక త్రిలోచన, ధూళిపాల సూర్య భగవాన్‌లతో ఇఒ బళ్ల నీలకంఠం ప్రమాణ స్వీకారం చేయించారు.

రక్తదానం చేసిన జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి-కాకినాడ

పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్, ఎఎస్‌పి దేవరాజ్ మనీష్ పాటిల్ శుక్రవారం రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల స్మారక కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ పోలీస్ కన్వెన్షన్ హాల్లో ఈ రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి శ్రీనివాస్, ఆర్ఐ, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఆదిత్య కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు 35 యూనిట్ల రక్తదానం చేశారని కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా చివరి రోజు రక్తదాన శిబిరం నిర్వహించారు. స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ మహమ్మద్ షాహిద్దీన్ రక్తదానం చేసి, విద్యార్థులను కూడా ప్రోత్సహించారు. వీరిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -కరప

కరప జూనియర్ కళాశాలలో 56 మంది విద్యార్థులకు ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. పదో తరగతి 2023-24 బ్యాచ్‌కు చెందిన నక్కా సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన పూర్వ విద్యార్థులు పెంకే నూకరాజు, నానాజీ, తుట్టా నరేష్, నక్కా భీమశంకర్, పోలిశెట్టి సునీల్, సలాది విజయ్ బాబు, భగవాన్, తుమ్మలపల్లి సత్యనారాయణ, కళాతులసి, పద్మిని పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాతీలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్వక విద్యార్థులను అభినందించారు.

రైతులందరికీ పరిహారం అందేలా కృషి

ప్రజాశక్తి- తాళ్లరేవు

తుపానుతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించేలా కృషి చేస్తామని పలువురు నాయకులు తెలిపారు. మంజేరు డిసి వైస్ చైర్మన్ కొత్తూరు కాశీఈశ్వరుడు, టిడిపి నాయకుడు భజన సత్తిబాబు, దంగేటి అన్వేష్, జనసేన నాయకుడు బోణం శ్రీనివాస్, గుండుపల్లి శ్రీనివాస్ వ్యవసాయ సహాయకులతో కలిసి నేలకొరిగిన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో చాలా వరకూ పంట నష్టం జరిగిందని తెలిపారు. జరిగిన నష్టాన్ని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధూర్‌కు వివరించి పరిహారం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.



సంతాపం తెలుపుతున్న సిపిఎం నాయకులు

బాబూరావు మృతికి సిపిఎం నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు అన్నారు. యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం బాబూరావు సంస్మరణ సభ సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సూరిబాబు మాట్లాడుతూ బాబూరావు తాడేపల్లిగూడెంలో ఒక సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి కార్మిక నాయకునిగా, సిపిఎం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో దారపురెడ్డి సత్యనారాయణ, కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, కూనిరెడ్డి అప్పన్న, నరసింహమూర్తి, కేదారి నాగు, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, గరగపాటి పెంటయ్య, సిరిపురపు మరిడియ్య పాల్గొన్నారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా సతీష్ కుమార్

ప్రజాశక్తి-కాకినాడ



కలెక్టర్‌ను కలిసిన డిఎస్‌డిఒ సతీష్ కుమా౦

కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌గా పనిచేస్తున్న వర్రి సతీష్ కుమార్ పదోన్నతిపై కాకినాడ జిల్లా క్రీడా అభివద్ధి అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్‌పి బిందు మాధవ్

విశ్రాంత ఉద్యోగులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-కాకినాడ

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎఆర్ ఎస్ఐ కొండలరావు, సివిల్ హెడ్‌కానిస్టేబుల్ వి.సత్యనారాయణను జిల్లా పోలీసు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్‌పి ఘనంగా సత్కరించారు. విశ్రాంత జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అతి త్వరగా ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనా అధికారిని ఆదేశించారు. ఎఆర్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సత్యమూర్తి పాల్గొన్నారు.

ఏలేరు జలాల విడుదలతో ఇబ్బంది లేదు

ప్రజాశక్తి - సామర్లకోట

ఏలేరు ప్రాజెక్టు అధిక మొత్తంలో జలాలను విడుదల చేసినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరదను కట్టడి చేయగలిగామని ఏలేరు ఇరిగేషన్ ఎస్ఇ గోపీనాథ్ వెల్లడించారు. సామర్లకోట ఉప్పు వారి సత్రం వద్ద పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ పెద్దవంతెన వద్ద లాకులను, నీటి ఉధతిని ఇరిగేషన్ ఆయన శుక్రవారం పరిశీలించారు. ఏలేరు ప్రాజెక్టులో అధిక జలాలు రావడంతో మిగులు జలాలను కిందికి వదులుతున్నట్టు ఆయన తెలిపారు. సాయంత్రానికి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతుందని ఆయన అన్నారు.

అభివృద్ధి పనులు లేవని కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గొల్లప్రోలు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్స్

వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు శుక్రవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత ఎజెండాలోని అంశాలపై కౌన్సిలర్లు మైనం భవాని, మొగలి దొరబాబు, గుల్ల సుబ్బారావు మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలోని సూరంపేట ఏరియాకు వాటర్ ట్యాంక్ ద్వారా 128 రోజులకు 221 కుటుంబాలకు రూ.5 లక్షల ఖర్చవుతుందని, అలాంటప్పుడు అక్కడే ఒక బోరు వెయ్యాలన్నారు. 2016, 2017-18లో ఇంకుడు గుంతలు పనులకు ఇప్పుడు బిల్లులపై అభ్యంతరం వ్యక్తం చేశారు వాటిని వాయిదా వేయాలని కోరారు దీంతో కమిషనర్ అహ్మద్ అలీషా వాటిని వాయిదా వేశారు అనంతరం మూడవ వార్డులో అభివద్ధి పనులు నోచుకోవడం లేదని పట్టణంలోని హిందూ స్మశాన వాటిక దాతల సహకారంతో నిర్మించుకున్న దానిలో పారిశుద్ధ్య పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు కౌన్సిలర్లు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, గంట అప్పలస్వామి, లింగం సంధ్య, మేనేజర్ నవీన్ చంద్ర, టిపిఒ నీలిమా దీప్తి సిబ్బంది పాల్గొన్నారు.

కొండబాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబును శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇప్పటి వరకు నాలుగు సంవత్సరాల పాటు ఆయన సిపిడిసి కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు సన్మానించి జ్ఞాపిక అందించారు. చైర్మన్ ప్రిన్సిపల్ చెన్నారావు, కార్యదర్శిగా దేవరపల్లి మూర్తిని ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు, అధ్యాపకులు వై.వీర నాగేశ్వరరావు, కె.పార్వతి, జి.వీరబాబు, జి.సురేష్, వై.గోపాలకృష్ణ, వై.శివ గణేష్, బొదిరెడ్డి చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ అనంతరం సేవలందించాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఉద్యోగి పదవి విరమణ అనంతరం సమాజ సేవకు అంకితం కావాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యుబిఎం.కుమార్ పిలుపునిచ్చారు. ఆర్‌టిసి కండక్టర్ ఉద్యోగ విరమణ చేసిన రామిశెట్టి నాగ భుజంగరావును ఆర్‌టిసి డిపో ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డిపో మేనేజర్ జివి.సత్యనారాయణ, జివి.రామారావు, విశ్వనాథం, ఎంఆర్.కృష్ణ, నాని బాబు, ఎన్ఎన్.రావు, ఎల్‌విఎస్.నారాయణ, కెఎస్‌కె.రావు, చిన్నారావు, వెంకట్రావు, ఎల్ఎస్.రావు, తోట గంగారావు, వీరవరం శ్రీను, జక్కా శ్రీను, ఎస్‌వి.రావు, పివిడి దేవి, అమ్ములు ఉన్నారు.



ఉపాధి పనుల నిర్వహణపై మాట్లాడుతున్న ఎంపిడిఒ నరేంద్రరెడ్డి

ఇకెవైసిని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పెదపూడి

మండలంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఇకెవైసి నమోదు వేగవంతం చేయాలని ఎంపిడిఒ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లుకు ఉపాధి పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 23 వేల జాబ్ కార్డులు ఉండగా, వారిలో సుమారు 68 శాతం మేర ఇకెవైసి పూర్తి చేశారన్నారు. మిగిలిన 32 శాతం వేగంగా పూర్తి చేయాలన్నారు. కొత్త ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యతగా చేపట్టాలన్నారు. ఉపాధి పనుల్లో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎపిఒ సత్యనారాయణ, ఇసి సురేష్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిందని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక నేమాంలో తహశీల్దారు ఎల్ఎన్.కుమారి ఆధ్వర్యంలో 48 మంది మత్స్యకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రతి కుటుంబానికీ 50 కేజీల బియ్యం, వంట నూనె, కందిపప్పు, చక్కెర, ఉల్లిపాయలు, బంగాళా దుంపలను పంపిణీ చేశారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎంపిపి నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, టిడిపి నాయకులు నులుకూర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస్ బాబా, చప్పడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీల, సిరంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన కార్మికుల మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట



సభలను ప్రారంభిస్తున్న కార్మిక సంఘం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల జిల్లా 2వ మహాసభ శుక్రవారం జగ్గంపేటలో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులు నిర్వహించనున్న సభల్లో తొలి రోజు స్థానిక పంచాయితీరాజ్ అతిధి గృహం వద్ద కళాకారులచే సాంస్కతిక ప్రదర్శనలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క సత్తిబాబు, సీనియర్ నాయకులు బోర సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, మండల అధ్యక్షుడు కొల్లు సత్తిబాబు, కార్యదర్శి కెంగం దుర్గ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివివి.సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు నండ్ల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజోలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

పోలీసుల సేవలు అభినందనీయని , మన రక్షణకోసం నిరంతరం పనిచేస్తూ మనకు అందుబాటులో ఉంటారని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు సంఘీభావంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదలాడకు చెందిన కోళ్ళ వెంకన్న సిఆర్‌పిఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఛత్తీస్‌ఘడ్ ల్యాండ్ మైన్‌లో మృతి చెందారని వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజోలు సిఐ నరేష్‌కుమార్, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

తాళ్లరేవు మండలం, చినవలసకు చెందిన పినపోతు లక్ష్మి, W/o. పెద్ద నూకరాజు కు చెందిన **U6960510** నెంబరు కల పాస్‌పోర్ట్ పడిపోయినది. 15-10-2025వ తేదీన చినవలస నుండి ముమ్మిడివరం మండలం అయినాపురం బంధువుల ఇంటికి వచ్చుచుండగా బ్యాగులో ఉన్న ఒరిజినల్ పాస్‌పోర్ట్ మార్గ మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

పినపోతు లక్ష్మి
W/o. పెద్ద నూకరాజు, డోర్ నెంబర్ 7-56
చినవలస గ్రామం, తాళ్లరేవు మండలం
కాకినాడ జిల్లా, సెల్: 9573898641

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), అమలాపురం వారి కోర్టులో
ఇపి నెం.08/2021 ఇన్ ఒ.ఎస్.నెం. 104/2018

బిట్వీన్:
తాడి పద్మా వెంకటరెడ్డి ...డి. హెచ్. ఆర్.
S/o. రామారెడ్డి, మురమళ్ళ, ఐ.పోలవరం మండలం
మరియు
రెడ్డి చెంచులక్ష్మి, భర్త: సత్యనారాయణ, 45 సం.లు, గృహిణి, పెద్ద నుయ్యి దగ్గర, టి.కొత్తపల్లి గ్రామం, ఐ.పోలవరం మండలం ...J.Dr

పై నెంబరు గల ఇ.పి.ని డి.హెచ్.ఆర్. జె.డి.ఆర్.పై డిక్రీ బాకీ వసూలు నిమిత్తం వేలం వేయించి వసూలు ఇప్పించమని కోరుతూ దాఖలు చేసియున్నారు. ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థి వేలం నిమిత్తం వాయిదా **దీ. 17-11-2025వ తేదీన ఉదయం గం॥ 10-00 ని॥** లగాయితు పై కోర్టు వారిచే ఆస్తి వేలంపాట నిర్వహించబడును. పాడుకొనేవారు స్వయంగా వేలం పాటలో పాల్గొనవచ్చును. వివరములకు డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాదిని గాని, శ్రీ కోర్టు నాజరు వారి ఆఫీసు నందు గాని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

ఇ.పి. షెడ్యూలు ఆస్థి వివరం

Schedule Property: Erstwhile East Godavari District, I.Polavaram Sub-Registry, property situated at T.Kothapalli Gram Panchayat and village of I.Polavaram Mandal an extent of Ac 1-00 cts covered by R.S.No.222-4 with following boundaries and all easementary rights and water ways etc.,
EAST: Land of Reddy Dhanakasulu. **WEST:** Land of Reddy Viranna. **NORTH:** Pantha Bodhi. **SOUTH:** Land of Anasuri Prasad.
With said boundaries with all easementary rights and etc.,
The proprty value as per the D.Hr Rs.10,00,000/-
Court Amena Value: Rs.25,00,000/-

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
కాశి సిద్ధార్థ కుమార్, అడ్వకేట్
ముమ్మిడివరం 533 216
ముమ్మిడివరం సెల్ నెం. 9390084662
తేది. 31-10-25 8106993972

ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. No. 44/2018 in O.S. No. 526/2004
Between :
Smt. చింతకాయల కాంచనమాల,
W/o.CH.ఆనంద్, గృహిణి, జగన్నాధపురం, కాకినాడ. ...DHr
మరియు
1) Smt. కర్నాసుల శివకుమారి,
W/o.K.సత్యనారాయణ, గృహిణి, డోర్.నెం. 48-4-73, గోగు దానయ్యపేట, జగన్నాధపురం, కాకినాడ.
2) Smt. షేక్ జమీలా,
W/o.మహ్మద్ గయుద్దీన్, వయస్సు 45 సం॥లు, గృహిణి, డోర్.నెం.15-7-12, ఇస్మాయిల్ వీధి, రామకృష్ణారావు పేట, కాకినాడ. ...JDR's

పై నెంబరు అమలు గ్రంధములో పై పిటీషనులో కోర్టు వారి ఆర్డరు ప్రకారం JDr No.2 కు కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు JDr No.2 స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట **ది.21-11-2025 సం॥తేదీన ఉదయం గం. 10.30 ని॥లకు** హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై పిటీషను మీ పరోక్షమందు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వెంకట ఆర్.బి.షా, అడ్వకేట్,
గాంధీనగర్, కాకినాడ, సెల్: 9848137399

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
F.D.I.A. 5/2024
O.S. 157/2018

Between:
శ్రీమతి తిరుపతి వెంకట లక్ష్మి సరస్వతి ...పిటీషనరు/ వాది
మరియు
శ్రీ కాటమరెడ్డి వెంకటేశ్వరరావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

టు,
2. Smt. Garapati Anantha Lakshmi, W/o Ajay Chakravarthi, Flat No.S-2, Maruthi Apartment, M.J.Colony, Near Radhika Theatre, Gayatri Nagar, ECIL, HYDERABAD, State of Telangana.
3. Smt.Akula Padma, W/o Durga Rao, D.No.102-4-22, Near Oil mill, Rajole Road, BOMMURU, Rajamahendravaram Rural Mandal, E.G.Dist.,

పై నెంబర్ ఫైనల్ డిక్రి పిటిషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటిసులు పంపినను తీసుకోనక బుద్ధిపూర్వకముగా avoid చేయుచునందున, ఈ పేపరు ప్రకటన ఇవ్వబడినది. కాబట్టి ఈ నోటీసు అందిన వెంటనే మీరు **ది. 07-11-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాయిదా: 07-11-2025
కొవ్వూరు **కె.వి.వి.హరిమోహన్,** అడ్వకేట్
తేది: 30-10-2025 సెల్: 9160061613

వేలం ప్రకటన

మహారాజశ్రీ గౌరవనీయులైన రాజమహేంద్రవరం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఈ.పి. నెం. 35/2025
ఓ.యస్. నెం. 77/2023

తురాల శ్రీనివాసయాడవ్ ...డిక్రీ హెల్డర్
మరియు
యలమంచిలి సురేష్, (తండ్రి) (లేటు) చిన్న వెంకటరత్నం, హిందువు, వయస్సు 51 సం॥లు, డోరు నెం. 80-13-2, వార్డు నెం. 29, కోకా భాస్కరమ్మనగర్, జె.యన్.రోడ్డు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా. ...జె.డి.ఆర్

పై నెంబరు డిక్రీ బాకీకి జడ్జిమెంట్ డెటార్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి పై కోర్టు వారు సమక్షములో **ది. 01-12-2025 తేదీన ఉదయం 10.30 గంటల** లగాయితు బహిరంగ వేలము జరుపబడును. ఆశక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చును. మిగతా వివరములకు డిక్రీ హోల్డరు గారి అడ్వకేటు ఆఫీసు నందు గాని, పై కోర్టు నజారతు ఆఫీసు నందు గాని తెలియజేయబడును.

వేలం కాబడు షెడ్యూలు ఆస్థి వివరములు

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, మున్సిపల్ కార్పొరేషన్, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం సబ్-రిజిస్ట్రీలో చేరిన జిరాయితీ మెరక ఆర్.యస్.నెం. 217 & 218 ర్లు లే-అవుట్ ప్లాను, ప్లాటు నెం. 74 యందు చ॥గ॥ 214 లు లో 1/4వ వంతు అవిభ్యపు వాటా అందలి డోరు నెం. 80-13-2రు ఆర్.సి.సి. బిల్డింగ్‌కు హద్దులు వివరము:
తూర్పు: జడ్జిమెంటు డెటార్ తాలూకు స్థలము - అ. 64.6లు. **దక్షిణం:** ప్లాటు నెం. 76 రు స్థలము - అ.31.0 లు. **పడమర:** అయినాల కమల సుందరమ్మ స్థలము - అ. 64.6లు. **ఉత్తరం:** రోడ్డు - అ. 31.0 లు
సదరు హద్దుల మధ్య గల చ.గ. *214* లు లో *1/4*వ వంతు అవిభాధ్యపు వాటా అందలి డో.నెం.*80-13-2* రు ఆర్.సి.సి. బిల్డింగ్ అందలి తలుపులు, ద్వారబంధములు, కుళాయి, యిందలి ఎలక్ట్రికల్ సర్వీసు కనెక్షను, ఎలక్ట్రికల్ ఫిట్టింగులు అందు మామూలు మార్గములు, ఈజిమెంటు హక్కులతో సహా.

డిక్రీ హోల్డరు విలువ : రూ. 12,00,000/-
అమీనా కిమ్మత్తు: రూ. 20,00,000/-
జె.డిఆర్. కిమ్మత్తు : ఇవ్వలేదు
మార్కెట్టు విలువ : రూ. 1,03,55,400/- లు నిర్ణయించడమైనది.

జె.బి.యస్.బాపూజీ, అడ్వకేట్,
డోర్ నెం.23-16-39/3, ఫ్లాటు నెం.102
అమరావతి రెసిడెన్సీ, హరిపురం,
రాజమహేంద్రవరం, సెల్:9866472266